
నైతిక, ఆధ్యాత్మిక పరివర్తన ద్వారా మాత్రమే మనిషి పూర్తి స్వేచ్ఛను పొందగలడు. మనిషి నిరంతరం దేనికొరకై చింతన చేస్తూ, పరిశ్రమిస్తుంటాడో చిట్టచివరకు దానిని పొందగలుగుతాడు.

STRENGTH IS LIFE
ISBN 93-85243-42-4
9 789385 243424
www.rkmath.org
Mrutyurahasyam ₹10/-

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు - 500 029
Email: publication@rkmath.org

# మృత్యురహస్యం



# మృత్యురహస్యం

స్వామి పరమానంద

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు - 500 029

Published by
Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29



First Impression: 6,000 Copies (November 2015)

ISBN 93-85243-42-4

Printed in India at
Sri Sarada Printers
Hyderabad

# మనవి

మానవ జీవిత గమ్యం మృత్యువు లేని ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడమే. అయితే మనిషి మనుగడ కేవలం ఈ ఒక్క జన్మకు మాత్రమే పరిమితమని భావించే వారికి మరణం ఒక దుస్స్వప్నంలా గోచరిస్తుంది. తాను 'దేహి'నని భావించేవారికి దేహమరణంతో తన మనుగడ ముగిసినట్లు కాదని, అది కేవలం రూపాన్ని మార్చుకొని కొత్త పరిసరాలలోకి ప్రవేశించడం మాత్రమేనని గ్రహించి అసంతృప్తికి లోనుకాడు. ఇదే మృత్యురహస్యం.

స్వామి వివేకానంద శిష్యులైన స్వామి పరమానంద రచనలు చిన్న పుస్తకాలుగా ఇదివరలో వెలువడ్డాయి. అవన్నీ బహుళ ప్రజాదరణను పొందాయి. ముఖ్యంగా ఈనాటి యువతరానికి అవి మేలుకొలుపు నాదాలు. ప్రస్తుత ఈ చిన్ని పుస్తకం వారి రచనలనుండి సంగ్రహించిన వాటికి తెలుగు అనువాదమే. ఆంగ్లంలో Problem of Life and Death పేరిట శ్రీరామకృష్ణ మఠం, చెన్నై ద్వారా వెలువడింది. దీనిని తెలుగులోకి అనువదించిన చిరంజీవి నరేన్‌కు మా ధన్యవాదాలు.

– ప్రకాశకులు

## విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | జననం - మరణం | ..... | 1 |
| 2. | విధిని తప్పించలేమా? | ..... | 14 |
| 3. | పునర్జన్మ - పరిణామక్రమం | ..... | 27 |
| 4. | పునరుత్థానం - అమరత్వం | ..... | 41 |




# జననం - మరణం

జనన మరణ రహస్యాన్ని మించి వేరొకటి ఏదీ మానవ మేధస్సుకు అత్యంత క్లిష్టమైన చిక్కుముడిగా ఉన్నది లేదు. ఆత్మకు మరణం ఉందా? శరీరంతో పాటు మనిషి అంతరించిపోవలసిందేనా? ప్రస్తుతం ఎరుకలో ఉన్న ఈ జీవితానికి మరణానంతరపు గతి ఏమిటి? యుగాల పర్యంతం మానవ మేధస్సును కలవరపరచి దానికి సవాలుగా నిలిచి అంతుచిక్కని ప్రశ్నగా ఇది నిలిచిపోయింది. శతాబ్దాలు దొర్లిపోయాయి. కాలచక్రంలో అప్పుడప్పుడు కొందరు మహాత్ములకు ఈ రహస్యానికి సంబంధించిన సత్యం తళుక్కుమంటూ అనుభూతమవడం, దానిని వారు మానవాళికి ఎలుగెత్తి చాటడం జరుగుతూనే వచ్చింది. అయినప్పటికీ ప్రతీ మానసంలోనూ ఈ ప్రశ్న మరల మరలా ఉదయిస్తూనే ఉంది. ఎందుకు? ఎందుకంటే ఇది స్వానుభవం ద్వారా మాత్రమే సమాధానం పొందే ప్రశ్న కనుక. ఒకరు భుజిస్తే వేరొకరి ఆకలి ఏ విధంగా తీరదో, అదేవిధంగా పై ప్రశ్నకు పరిష్కారాన్ని చూపించే ఆత్మజ్ఞానం కూడా ఎవరికి వారు శోధించి అనుభవంలోకి

తెచ్చుకోవలసిందే. ఇతరుల అనుభవం ద్వారా అది మనకు బోధపడదు. అమరత్వ స్థితిని సాధించిన కొందరు మహాపురుషులు ఈ మరణం అన్న ప్రశ్నకు సమాధానాన్ని విడిచిపెట్టి వెళ్ళారు. కాని దానిని మాత్రం మన స్వానుభవం ద్వారా మాత్రమే ధ్రువీకరించుకోగలం. అమృతం గురించి విన్నంత మాత్రాన మనం అమరులమైపోం, అమృత సేవనం వలన మాత్రమే మనం అమరత్వస్థితిని పొందగలం.

కేవలం స్వానుభవం ద్వారా తప్ప మరే ఇతర విధంగానూ ఈ సమస్యకు సమాధానం లభించనట్లైతే, ఈ మహాత్ముల వల్ల మనకు ఒనగూరే మేలు ఏమిటి? కనీసం ఈ జన్మలోనైనా మృత్యువును జయించి అమరులం కాగలమన్న ఆశను వారు చిగురింపజేస్తున్నారు. ఆత్మజ్ఞానాన్ని పొందే మార్గాన్ని చూపించి వారు మనకు సాయపడుతున్నారు. ఒక్కసారి మార్గమంటూ స్పష్టంగా తెలిసాక దానిని అనుసరించి పోవడమే మన కర్తవ్యం. ప్రతీ మానవుడి చరమ లక్ష్యమైన ఏ స్థితిని ఈ మహానుభావులు పొందారో, అటువంటి స్థితిని పొందడానికి మనం కూడా శ్రద్ధా విశ్వాసాలతో పాటుపడాలి. అందుకు కావలసినది స్వప్రయత్నం మాత్రమే. అశాశ్వతమైన భౌతిక ప్రపంచపు హంగులకు ఆకర్షితులమై మనం ఈ విషయాన్ని త్వరగా



మరచిపోతుంటాం. ఈ తళుకులీనే పరిసరాలకు మనం ఎంతగా ఆకర్షితులమైనప్పటికీ నేడో రేపో ఈ జీవిత గమ్యం ఏమిటి? అన్న ప్రశ్న మన మానసంలో ఉదయించక మానదు. జరామరణశోకాలు మనిషిని అతలాకుతలం చేసినప్పుడల్లా ఈ ప్రశ్న పునరావృతమై మన మానసంలో ఉబికి వస్తూనే ఉంటుంది.

అసలు ఈ ప్రశ్న ఎందుకు తలెత్తుతుంది? ఎందుకంటే మనిషి మరణాన్ని వాంఛించడు కనుక. అతడు ఏ రీతిలోనైనా మనుగడ సాగించాలనే ప్రయత్నిస్తుంటాడు. బ్రతకాలనే ఈ తాపత్రయమే అతడిని అశాంతికి గురిచేసి ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనే విధంగా పురికొల్పుతుంది. మనిషి జీవనాన్నే ప్రేమిస్తాడు. అతను అంటిపెట్టుకొని ఉన్న ఈ జీవితం అనేది ఏమిటి? ఉన్నది అది మాత్రమే. కేవలం అది మాత్రమే తన ఉనికిని మనిషికి అనుభూతం చేయగలదు. ఆ చైతన్యం లేనిదే చూడటం, మాట్లాడటం, మరి ఏ ఇతర వ్యాపారం (కదలికలు) కూడా సాధ్యపడదు. ఆ చైతన్యపు ఆసరా లేనిదే ఈ భౌతిక ఆకారాలకు ఎటువంటి శక్తీ, విలువా లేవు. ఇతరులను ప్రేమిస్తున్నామని చెప్పినప్పుడు మనం ప్రేమించేది ఈ సజీవ చైతన్యాన్నే. మన స్నేహితుల భౌతిక ఆకారాలను కాదు మనం

ప్రేమించేది, ఈ కీలక కేంద్రమైన జీవశక్తినే. ప్రతి ఒక్కరిలో అంతర్నిహితంగా ఉన్న ఆ ఆత్మనే మనం నిజానికి ప్రేమించేది. ఇది సుస్పష్టం. ఎందుకంటే జీవం శరీరం నుంచి నిష్క్రమించినప్పుడు, అప్పటివరకూ ప్రాణప్రదంగా భావిస్తూ వచ్చిన మన ప్రియతముల శరీరాలను ఇక ఎంతమాత్రమూ లక్ష్యపెట్టం, వాటిని అగ్నికి ఆహుతి చేస్తుంటాం. ఇది మనం భౌతిక శరీరాలను కాదు, అందులో నెలకొని ఉన్న ఆత్మను ప్రేమిస్తున్నామనడాన్ని రూఢి పరుస్తుంది. ఈ ఆత్మ అద్వితీయమైనది, నాశనం లేనిది, అమరమైనది.

ఆత్మకు మరణం లేదన్న భావన మనిషిని అప్రమత్తుడిని చేసి బాధ్యతాయుత పథంలో నడుపుతుంది. భావి జీవితం అనేది ఉన్నట్లైతే దానిని ఏ విధంగా మలచుకోవాలనేది మన చేతుల్లోనే ఉంది. స్వేచ్ఛాయుత జీవనమా లేక బానిసబతుకా, ఆనందభరితమా లేక దుఃఖమయమా అనేది మనమీదే ఆధారపడి ఉంది. ఏ మనిషి కూడా ఈ జననమరణ, సుఖదుఃఖాల చక్రభ్రమణంలో శాశ్వతంగా పరిభ్రమించాలని కోరుకోడు. ఏ చిన్న కోరిక మిగిలి ఉన్నా ఈ చక్రభ్రమణంలో నుంచి బయటపడటానికి అతడు నిజంగా నిస్సహాయుడే. అందుకే



మన ప్రాచీన మహర్షులు ఈ కోర్కెలను నియంత్రించే విధానాన్ని మనకు నేర్పించి వెళ్ళారు. ధనమూ, అధికారమూ, జీవితాన్ని అనుభవించాలి అనే పలురకాల కోర్కెల చేత ఈ ఆత్మ ఆవరించబడి ఉంటుంది. కాని తరచి చూస్తే ఈ పరిమితులన్నీ శరీరానికి సంబంధించినవే. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ఈ శరీరంతోనే మన అస్తిత్వం ముడిపడి ఉందన్న భావన కేవలం భ్రమ మాత్రమే. శరీరం నశించిపోతుంది, కాని ఆత్మ మరణం లేనిది. శరీరం పరిమితులకు లోబడినది. మరి ఆత్మో, అనంతమైనది. దానికంటూ ఒక ఆకారం లేదు. అది సూక్ష్మాతిసూక్ష్మమూ, అపరిమితమూ, అమేయమూ అయినది. నీటికి తనకంటూ ప్రత్యేకమైన ఒక ఆకారం లేదు. కాని అది తాను ప్రవేశించిన పాత్రల ఆకారాన్ని పొంది, చివరకు సముద్రంలో కలిసి తన ఆకారాన్ని కోల్పోతుంది. అదేవిధంగా జీవాత్మకు కూడా తనకంటూ ఒక ప్రత్యేక రూపం ఏదీ లేదు. అయినప్పటికీ అది తాను వసించిన శరీరాల రూపాన్ని అపాదించుకుంటుంది. ఎప్పుడైతే అది తన స్వస్వరూపాన్ని గుర్తెరుగుతుందో, తక్షణమే ఆ పరమాత్మలో లీనం అయిపోతుంది.

కొంతమంది విజ్ఞులు జ్ఞానమార్గాన్ని అవలంబించి "ఇది కాదు, ఇది కాదు" (నేతి, నేతి) అంటూ తమ విచారణను కొనసాగించి తుదకు సత్యాన్ని సాక్షాత్కరించుకొన్నారు. వారు ముందు శరీరంతో ప్రారంభించి, అది పుట్టి మార్పుచెంది తుదకు నశిస్తుంది కనుక అది ఆత్మకాదు అని నిర్ధారించుకొన్నారు. అనంతరం మనస్సును గైకొన్నారు. కాని అది కూడా చంచలమైనదని గమనించి అది కూడా ఆత్మ కాదని తీర్మానించారు. ఈ విధమైన విచారణా మార్గం ద్వారా మరింత ముందుకుపోయి ఆత్మసాక్షాత్కారాన్ని పొంది తుదకు సంతుష్టులయ్యారు. తమ అనుభవం ద్వారా వారు ప్రపంచానికి చాటిచెప్పింది ఇదే: "మీరంతా, ప్రతీ జీవిలోనూ వసించే ఆ పరమాత్మ స్వరూపులే. పైపై మెరుగులకు భ్రమపడి స్థూల భౌతిక ప్రపంచంలో ప్రాకులాడినంతకాలం మీరు ఆ అంతరాత్మను దర్శించలేరు. అంతర్ముఖులవండి. అది మీలోనే దాగి ఉందని కనుగొంటారు. మీ స్వస్వరూప ఎరుకను పొంది, అది జనన మరణాలకు అతీతమై సర్వవ్యాపకంగా శాశ్వతమై నిలిచి ఉండేదని గుర్తెరుగుతారు."

"ఒకవేళ నా ఆత్మ అమరమైనంత మాత్రాన ఆ విషయాన్ని తెలుసుకోవడం వలన క్రొత్తగా నాకు



ఒనగూరేదేమిటి, నా జీవితం శాశ్వతమైనంత మాత్రాన, దాని గురించి నేను ఎందుకు లక్ష్యపెట్టాలి?" అని మీరు అనవచ్చు. ఒక్కటి మాత్రం నిజం. ఒక వస్తువు కలిగి ఉండటానికి, అది మన వద్ద ఉందన్న నిజాన్ని గుర్తెరగడానికి మధ్య చాలా తేడా ఉంది. ఒక వ్యక్తి వద్ద కోటానుకోట్ల గుప్తనిధులు ఉండి ఉండవచ్చు. కాని ఆ విషయం తెలుసుకోనంత వరకూ అతడు తనను తాను దరిద్రుడిగానే భావించుకొని, ఆకలి బెంగతో భయపడుతూనే ఉంటాడు. అఖండమూ, అమేయమూ, శాశ్వతమూ అయిన ఆ పరమాత్మకు మనం వారసులమైనప్పటికీ, ఆ విషయాన్ని గుర్తెరగనంతవరకూ క్షణక్షణం భయపడుతూనే బ్రతుకును వెళ్ళదీయవలసి ఉంటుంది. జీవితమంతా బాధలతో, ఆందోళనలతో నిండి ఉంటుంది. స్వస్వరూప జ్ఞానం మాత్రమే ఈ బాధలను పారద్రోలగలదు. మరణాన్ని అధిగమించడం అనేది ఎలా ఉంటుందో స్వానుభవపూర్వకంగా తెలుసుకోనంత వరకూ, దాని గురించి ఎన్ని గ్రంథాలు పఠించినా, ఎందరి నోట విన్నా అదంతా నిష్ప్రయోజనమే. మరణం ఆసన్నమైనప్పుడు భయంతో వణికిపోతుంటాం. అమరత్వాన్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందనంతవరకూ, దానిని గురించిన వర్ణనలు, పాఠాలు మనకు ఏ మాత్రం ధైర్యాన్నీ, నమ్మకాన్నీ కల్పించలేవు.

ప్రాచ్యంలో కాని, పాశ్చాత్యంలో కాని ఒక సిద్ధాంతం ప్రతిపాదించబడిందంటే దానిని మనం ఎందుకు గ్రుడ్డిగా ఆమోదించాలి? ప్రతి వ్యక్తీ యుక్తాయుక్త విచక్షణ చేసి, స్వీయ ఆలోచనల మీద ఆధారపడగలగాలి. ఇతరులు చెప్పినంత మాత్రాన గ్రుడ్డిగా ఎందుకు నమ్మాలి? ఏ మతాన్నైనా, సిద్ధాంతాన్నైనా నిజమని నమ్మేముందు అందులోని సత్యాసత్యాలను పరీక్షించి, పరిశీలించి, స్వీయ వివేకంతో ఋజువు పరుచుకోవాలి. మనకు మార్గదర్శకులు, స్ఫూర్తి ప్రదాతలు అయిన వారి వద్ద నుండి సూచనలు, సలహాలు స్వీకరించవచ్చు. కాని మన మనస్సులను ఆవరించి ఉన్న అంధకారపు ముసుగును స్వప్రయత్నం ద్వారానే తొలగించుకోగలం. "నశ్వరమయ్యే పదార్థాల నడుమ అనశ్వరమై చావు పుట్టుకలు లేనిదిగా ఆత్మ స్థితమై ఉంది" అన్న ఆర్యోక్తిని విన్నప్పుడు, అది ఏమై ఉంటుంది? అని మనం తప్పనిసరిగా ప్రశ్నించుకోవాలి. ఇతర పదార్థాలలాగా నేడో రేపో నశించిపోయే ఈ భౌతికశరీరం కచ్చితంగా కాదు, శాశ్వతంగా నిలిచి ఉండే ఇతరమైనది ఏదో మనలో అంతర్నిహితమై ఉంది. మరి అటువంటప్పుడు మట్టిలో కలిసిపోయే ఈ భౌతికశరీరంపై ఆధారభూతులమవుదామా లేక నాశనం చేయబడని, దొంగిలించబడని, అపవిత్రం



చేయబడనటువంటి ఆ నిగూఢ అస్తిత్వాన్ని పొంద ప్రయత్నిద్దామా? కేవలం అది మాత్రమే మన శక్తికి, ప్రేరణకు ఆధారభూతమైనది, దానిని పొందడం ద్వారా మాత్రమే మనం ఆపదలను, పరిమితులను అధిగమించగలం.

శీతోష్ణ, సుఖదుఃఖాలచే వ్యగ్రుడై, పేరుప్రతిష్ఠల కోసం, కేవలం స్వప్రయోజనాలకోసం ప్రాకులాడుతూ తనను తాను శరీర మాత్రుడిగా మాత్రమే భావించే వ్యక్తి పరుల మేలు కోసం తన సమయాన్ని వెచ్చించలేడు. తోటివారు తిండిలేక ఆకలికి మలమల మాడుతుంటే, తన ఆకలి మాత్రమే తీరితే చాలనుకునే స్వార్థభావనలు మనిషికి ఎటువంటి ఉన్నతినీ కలిగించలేవు. మన నిజస్వరూపం ఆత్మే అన్న సత్యాన్ని గుర్తించిననాడు మాత్రమే నూటికి నూరు శాతం మనిషి నిస్వార్థపరునిగా మారి పరులకు సాయపడగలడు. ఎందుకంటే తత్క్షణమే ఇతరులు కూడా ఆత్మ స్వరూపులే అన్న సత్యాన్ని అతడు గుర్తెరుగుతాడు కనుక. మనిషిని నిర్భయునిగా, నిస్వార్థపరునిగా, సర్వశక్తిమంతుడిగా చేసేది ఆత్మజ్ఞానం తప్ప మరొకటి కాదు. లభించిన ఏకైక అవకాశం ఎక్కడ చేజారిపోతుందోనన్న ఆత్రుతతో పిచ్చి ఆవేశంతో కోరికలు తీర్చుకోవడానికి

పరుగులెత్తే మానవునిలోని అశాంతిని, అసహనాన్ని సమూలంగా తుడిచిపెట్టివేసేది ఆత్మ సాక్షాత్కారమే. ఆత్మ శాశ్వతమన్న నమ్మకం లేకపోవడం, మనిషి మనుగడ కేవలం ఈ ఒక్క జన్మకు మాత్రమే పరిమితం అనే సంకుచిత భావనలు, అన్ని రకాల దుష్ప్రవర్తనలకూ, స్వార్థపరత్వానికీ మూలాలుగా నిలుస్తున్నాయి. తన శాశ్వత మనుగడలో, ఈ శరీరంలో వసించిన కొద్ది దినాలు అతి స్వల్పభాగం మాత్రమేనని, శారీరక మరణంతో తన మనుగడ ముగిసినట్లు కాదని, అది కేవలం రూపాన్ని మార్చుకొని కొత్త పరిసరాలలోకి ప్రవేశించడం మాత్రమేనని మానవుడు తెలుసుకొన్ననాడు, మరణాన్ని ఇక ఎంతమాత్రమూ ఒక శత్రువుగా పరిగణించడు. అంతేకాదు, ప్రస్తుత జీవనంతో అతడు ఇక ఏ మాత్రమూ అసంతృప్తికి లోనుకావడం అనేది జరుగదు.

ఆత్మజ్ఞానాన్ని సముపార్జించే క్రమంలో శరీరాన్ని నిర్లక్ష్యం చేయవలసిన అవసరం లేదు. రెంటిపైనా తగుమాత్రపు శ్రద్ధ వహించవలసి ఉంటుంది. శరీరాన్ని సాధనంగా గైకొని ఆత్మను సాక్షాత్కరించుకొనే ప్రయత్నం చేయాలి. అలాగే ఆత్మకు అధీనమైన పరికరంగా శరీరాన్ని భావించాలి. ఈ భావనతో ఎవరైతే పురోగమిస్తారో వారు



తమ చరమలక్ష్యాన్ని తప్పక సాధించగలరు. కేవలం భౌతిక అవసరాలకోసం అర్రులు చాచేవాడు ఇహపరాలు రెంటినీ కోల్పోతాడు. ఈ జన్మలో శక్తిమేరకు, వీలుపడినంత భౌతిక ఆనందాలను పొందడానికి ప్రయత్నించడం ద్వారా అత్యుత్తమ లబ్ధిపొందామని భావించకండి. ఈ భౌతిక జీవితపు ఆనందాలను త్యజించడం ద్వారా, ఆత్మ సామ్రాజ్యానికి మనలను చేరవేసే దారిని కనుగొన్నప్పుడు మాత్రమే నిజంగా మనం లబ్ధి పొందినట్లు భావించాలి. ఈ విధంగా చేయగలిగితే, ఈ జన్మలో నిజంగా మనం గరిష్ఠ లబ్ధిపొందినట్లే. ఎందుకంటే ఆ మార్గంలో మనం జీవితాన్ని సావధానంగా గడపడమెలాగో నేర్చుకుని ఉంటాం, మరణాన్ని ఏ జంకూ లేకుండా ఎదుర్కొని సాగిపోతాం కనుక మనిషి ఒక వస్త్రాన్ని విడిచి ఇంకో వస్త్రాన్ని ధరించినట్లే. మరణాన్ని కూడా ఆత్మ కొత్త శరీరాన్ని ధరించే ప్రయాణంగా భావించి నిర్భీతిగా ఎదుర్కొన్నవాడు మాత్రమే సిసలైన బ్రహ్మజ్ఞానికి ఋజువుగా నిలిచిపోతాడు.

మృత్యువుకు మనమెందుకు భయపడాలి? అది శరీరాన్ని నాశనం చేయవచ్చుగాని ఆత్మను కాదు. మనకు ప్రియమైనవారు మరణిస్తే మనమెందుకు దుఃఖించాలి? ఆ మనిషి నిజంగా మరణించినట్లు కాదు. కేవలం అతను

ధరించిన శరీరమనే ఈ రక్తమాంసాల తొడుగును మాత్రమే విడిచివెళ్ళాడు. అసలు మనిషి ఇంకా జీవించే ఉన్నాడు. దీని గురించి సరైన అవగాహన లేకపోవడం వలన మనం కష్టాలు అనుభవిస్తుంటాం. జీవితాన్ని సరిగ్గా అధ్యయనం చేయనివాడికి, దాని పరమార్థాన్ని గ్రహించలేనివాడికి మరణానంతరం అంతా అంధకార బంధురంగా తోస్తుంది. కాని ప్రస్తుత జీవితాన్ని సక్రమంగా అర్థం చేసుకొన్నవాడికి, తదనంతర జీవితంతో గల సంబంధం స్పష్టంగా విశదపడుతుంది. నూతన వేషాన్ని నిశ్శబ్దంగా ధరించి, కొత్త విధులను సహజసిద్ధంగా, సునాయాసంగా స్వీకరిస్తాడు. అటువంటి వ్యక్తి నిర్భయుడై, భగవంతుడి ఆదేశాలను అమలుపరచడానికి మాత్రమే జీవించి ఉంటాడు. అతనికేదైనా దురదృష్టం సంభవిస్తే అది భగవదిచ్ఛ మేరకే జరిగిందని, అదేవిధంగా ఏదైనా విజయం దక్కినా, ఆనందం కలిగినా అది కూడా కేవలం భగవదిచ్ఛ వలన మాత్రమే సంభవమని ఎరిగి ఉంటాడు. ఆ విధంగా జీవితాన్ని అనంతమైన భగవదిచ్ఛ కు వ్యక్తీకరణగా దర్శించి, తనను తాను ఆ పరమాత్మకు పూర్తి అధీనుడిగా చేసుకొంటాడు. ఆ అనంత పరమాత్మ దివ్యత్మం అతని ప్రతీ ఆలోచనలోను, మాటలోను, చేతలోను ప్రతిబింబిస్తుంది.



ఈ శరీరం గాని, మరుజన్మలలో ధరించే శరీరాలుగాని రాలిపోవచ్చు. అయినప్పటికీ, అమరమైన ఆత్మ స్వరూపాన్ని ఎరిగినవాడై, “మృత్యువు నన్నేమీ చేయలేదు” అంటూ మొక్కవోని ధైర్యంతో ఎలుగెత్తి చాటుతాడు. ఈ దృఢనమ్మకాన్ని కలిగినవాడు ఎక్కడైనా జీవించగలడు. సమాజం మధ్యలో కాని లేదా దానికి ఏ మాత్రం సంబంధం లేకుండా కాని; తీవ్రమైన కార్యాచరణలో కాని లేదా నిశ్శబ్ద ఏకాంతంలో కాని ఎక్కడైనా ఒకే రీతిలో తన జీవనాన్ని కొనసాగించగలడు. తను వెళ్ళిన ప్రతిచోటుకూ ఆ దివ్య ప్రకాశాన్ని కొనిపోగలడు. మరణాన్ని అధిగమించడమంటే, మనం మృత్యువాత పడమనో లేదా మన శరీరం మరణానికి గురికాదనో అర్థం కాదు. ఏది నశ్వరమో, ఏది అనశ్వరమో తెలుసుకోగలిగే జ్ఞానాన్ని సంపాదించడం ద్వారా మనం మన నిజతత్త్వమైన ఆత్మకు మరణం లేదన్న విషయాన్ని గుర్తిస్తాం.

# విధిని తప్పించలేమా?

భౌతికశాస్త్రం పదార్థ నియమాలను వివరించగలిగింది కాని మానవ జీవిత సూత్రాలను వివరించడంలో వైఫల్యం చెందింది. అది బాహ్య భౌతిక ప్రపంచంలో సంఘటనలకు గల కార్యకారణ సంబంధాన్ని వివరించగలిగింది. కాని మానవులలో ఒకడు దరిద్రునిగా జన్మించి దురదృష్టాలకు లోనవడం, మరొకడు సకల సంపదలనూ, ఆనందాలనూ ఎందుకు పొందుతాడో మాత్రం వివరించలేకపోయింది. కారణం లేనిదే కార్యం లేదన్నదే సూత్రమైతే, మరి ఒకడు దరిద్రునిగా మరొకడు సంపన్నుడిగా జన్మించడానికి గల కారణం ఏమిటి? దీనికి మతం ఇచ్చే సర్వసాధారణమైన సమాధానం భగవదిచ్ఛ. భగవంతుడు తన ఇచ్ఛమేరకు అవసరమైతే కొరడా ఝుళిపించగలడు లేదా కరుణను వర్షించగలడు అన్నదే సమాధానం. ఈ వ్యత్యాసాన్ని అతడు ఎందుకు చూపించాలి? దానికేదో కారణం తప్పక ఉండి ఉండాలి. ఇచ్ఛానుసారం పిల్లలను దండించడమూ, సత్కరించడమూ చేసేవాడు ఆదర్శప్రభువు తప్పకుండా కాడు, ఏ నియంతో అయి





ఉండాలి. ఇంతకు మించిన సంతృప్తికరమైన సమాధానం తప్పకుండా ఉంది. మన ఋషులు, తత్త్వవేత్తలు కర్మ సిద్ధాంతమే దీనికి సరైన సమాధానంగా కనుగొన్నారు. కార్యకారణ సంబంధ సూత్రాన్ని మానవ జీవితానికి అన్వయిస్తే వచ్చేదే ఈ కర్మసిద్ధాంతం. ఈ సృష్టిలో నెలకొని ఉన్న వ్యత్యాసాలకు వారు పరమాత్మను నిందించలేదు. అందుకు కారణం మనిషిలోనే ఉన్నట్లు వారు కనుగొన్నారు. తన విధికి మానవుడే బాధ్యుడు. అతడే తన స్వీయ భాగ్యవిధాత. తను గతంలో చేసిన కర్మల ఫలితమే ప్రస్తుత జీవనం. దేనినైతే నాటుతామో, ఆ పంటనే మనం పొందగలం. నాటిన విత్తుకు భిన్నమైన పంటను మనం పొందలేము. ఆ పరమాత్మకు లంచం ఇవ్వలేం. మంచి ఫలసాయం పొందాలంటే, అందుకు అనుగుణంగా మన జీవితాన్ని మెరుగుపరచుకోవాలి. మంచి చెడుల పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అత్యున్నత విచక్షణతో కూడిన జీవితాన్ని గడపగలగాలి. ఆ విధంగా చేయనట్లైతే, ఎదురయ్యే పరిణామాలను అనుభవించి తీరవలసిందే. మనమెంత తప్పుకొన ప్రయత్నించినప్పటికీ, చెడు పనులు చివరకు దుఃఖాన్నే కొనితెస్తాయి.

ఈ నియమాన్ని ఉల్లంఘించడం మన తరం కాదు. దీన్ని దాటిపోవడానికి మనకు ఏ దేవదూతా తోడురాడు,

సహాయపడదు. ఎంతచెట్టుకు అంత గాలి అన్నట్లు, చేసిన కర్మకు ఫలితం అనుభవించక తప్పదు. ఇది అనుల్లంఘనీయం. భగవంతుడేమీ మనల్ని ఈ పరిస్థితిలో పడవేయలేదు. మనలను సదా క్రిందికి లాగివేస్తూ పరిస్థితుల ప్రభావంలో పడవేయ చూసే బంధాలకు కట్టుబడిపోయి మనం ప్రస్తుత స్థితిని కల్పించుకున్నాం. కృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు భగవంతుడు మన మంచిచెడులలో ఏ భాగాన్నీ తీసుకోడు. అజ్ఞానమనే మబ్బుచే కప్పివేయబడి జీవులు ఆ అజ్ఞానంలో ముంచివేయబడుతున్నారు. ఈ భ్రాంతిలో ఉంటూ మనలను రక్షించేది లేదా శిక్షించేది ఆ భగవంతుడేనని తలపోస్తూ గడిపేస్తాం.

కేవలం అజ్ఞానం మాత్రమే ఈ దుఃఖాలకూ, బానిసత్వానికీ మూలకారణం. ఈ అజ్ఞానంలో, అపరిపక్వతలో మునిగి ఉన్నంతవరకూ మన మానసాలలో విచారపు ఛాయలు ఏదో ఒక మూల నెలకొనే ఉంటాయి. దాన్ని తప్పించడానికి మనం చేసే ప్రయత్నాలన్నీ నిష్ఫలమైపోతాయి. చుట్టుముట్టి ఉన్న పరిస్థితుల నుంచి దురంగా పారిపోవడానికి ప్రయత్నించడం దీనికి పరిష్కారం కాదు. ఆ పరిస్థితులను కల్పించి, నియంత్రించే ప్రకృతి సిద్ధ నియమాన్ని అవగాహన చేసుకొని స్వీకరించడమే



అసలైన విరుగుడు. ఈ అవగాహన లేకపోవడం వలన తాము అతి దైన్య పరిస్థితుల పాల్పడినప్పుడల్లా, వాటి నుండి బయటపడటానికి ఆత్మహత్యే శరణ్యంగా కొంతమంది జనులు భావిస్తుంటారు. దైన్యాన్ని తప్పించుకోవడానికి జీవితాన్ని అంతం చేసుకోవడమే సరైన మార్గంగా సూచించేంత సంకుచితమైనది, బలహీనమైనదా ఈ ప్రకృతిబద్ధ నియమం? అసాధ్యం! కానే కాదు. తాను సృష్టించుకున్నవి తనను వెంబడించే వస్తాయి. మనం చంపితే నశించిపోవడానికి ఆత్మ ఒక పదార్థమో, వస్తువో కాదు దైన్యానికి దారితీసే పరిస్థితులను కూడా అదేవిధంగా నాశనం చేయలేము. కర్మ నియమాన్ని అర్థం చేసుకోనంత కాలం ఈ దైన్యం తప్పదు.

మనిషి తన స్వీయ జీవితాన్ని అధ్యయనం చేయడం నేర్చుకోవాలి. స్వీయ ఆలోచనలను, చేతలను, వ్యక్తిత్వాన్నీ చాలా నిశితంగా పరిశీలించాలి. ఈ జన్మలో తను అనుభవించే ఫలాలన్నిటికీ తన ఆలోచనలు, చేతలే మూలకారణంగా అతడు త్వరలోనే గ్రహించగలడు. బుద్ధుడు చెప్పినట్లు మన గత ఆలోచనల ఫలితమే ప్రస్తుతపు మనం బండిని లాగే ఎద్దుని చక్రం అనుసరించినట్లు, ఏ మనిషైనా చెడు మాట్లాడుతూ, చెడ్డపనులు చేస్తే చివరకు బాధలనే

పొందవలసి ఉంటుంది. నీడ మనిషిని వెంబడించినట్లే పవిత్రమైన మనస్సుతో సత్కార్యాలు చేసేవాడు చివరకు ఆనందాన్నే పొందగలడు. ఈ జన్మలో వర్తించే కర్మ సిద్ధాంతమే మరుజన్మలలో కూడా నిజమయ్యే తీరుతుంది. ఈ నియమాన్ని కనుక తు.చ. తప్పక పాటించినట్లైతే మనిషి సకల బాధలనుంచీ ముక్తుడై తాను ఎంచుకున్న రీతిలో జీవితాన్ని గడపగలడు. త్రికరణశుద్ధితో కర్మాచరణ మొనరించడమే అతను చేయవలసింది. కేవలం వేదోక్త పంక్తులను వల్లెవేస్తూ, చిలకపలుకులు పలుకుతూ ఉపన్యాసాలిచ్చేవాడు కాదు, వాటిని నేర్చుకొని ఆచరణాత్మక మొనరించిన వాడు మాత్రమే ప్రతికూల పరిస్థితులను అన్నింటినీ అధిగమించి తన జీవితానికి ధన్యతను చేకూర్చుకోగలడు.

మన కష్టార్జితం కానిదేదీ మన దరికి చేరుతుందని ఆశించలేం. ప్రాప్తం లేనిదే ఎంత ప్రయత్నించినా మనది కాని వస్తువు మన దగ్గర నిలువదు. హైందవ పురాణాలలో దీని గురించిన ఒక కథ ఉంది. తీవ్రమైన కష్టాలలో ఉన్న ఒక పేదవానికి సహాయం చేయమని పార్వతీదేవి పరమేశ్వరుడిని కోరుతుంది. అది సాధ్యం కాని పనంటూ శివుడు త్రోసిపుచ్చుతాడు. అందుకు పార్వతీదేవి



"పరమేశ్వరుడికి కూడా సాధ్యం కానిదంటూ ఏదైనా ఉందా?" అంటూ తన ఆశ్చర్యం వెలిబుచ్చుతుంది. "ఆ విషయాన్ని నీకు ఇప్పుడే నిరూపిస్తాను" అంటూ పరమేశ్వరుడు పార్వతీదేవికి ఒక దృశ్యం చూపించుతాడు.

ఆ పేదవాడు తీవ్రమైన ఆందోళనతో మరుసటి రోజు ఎలా గడుస్తుందా? అని మథనపడుతూ ఒక అరణ్యమార్గం గుండా నడిచివెళుతుంటాడు. అతను వెళ్ళబోయే మార్గం మధ్యలో శివుడు ఒక బంగారపు మూటను ఉంచుతాడు. తీరా ఆ ప్రదేశాన్ని దాటే సమయానికి ఆ పేదవాడి కన్నులు మూతపడతాయి. ఆ బంగారాన్ని పొందే అవకాశాన్ని కోల్పోతాడు. మనతోటి కూడా ఎప్పుడూ జరిగేది ఇదే. మనం కోరుకున్న వాటిని పొందగలిగే అర్హత మనకుండాలి. అప్పుడు మాత్రమే మనం వాటిని పొందగలం.

మనం చేసే పనులు, ఆలోచనలు అవి ఎంత చిన్నవైనప్పటికీ తుదకు అన్నీ కలిసి మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. మన ఆనందం కాని, అశాంతి కాని వాటి ఫలితమే. మనం గుర్తించినా, గుర్తించకపోయినా ఇది మాత్రం పచ్చి నిజం. బాధలను పోగొట్టుకుని ముక్తిని సాధించే మంత్రం మన మాటలు, చేతల్లోనే ఇమిడి ఉంది.

అందుచేత మనం చెప్పే ప్రతీ మాటలోను, వేసే ప్రతీ అడుగులోనూ ఎంతో జాగరూకత వహించవలసి ఉంది. ఒక ఆలోచన అది ఎంత చిన్నదైనప్పటికీ మహా మహా కార్యాలకు మాతృకగా పనిచేస్తుంది. అది మంచి కావచ్చు, చెడుకావచ్చు. చేసిన తప్పుల ఫలితంగా బాధలు చుట్టిముట్టినప్పుడు మనిషి తరుణోపాయం వెతకకుండా నిస్సహాయుడిగా ఉండిపోవాలని దీని అర్థం కాదు. తను సృష్టించుకున్న పరిస్థితులను తిరగరాసుకునే శక్తి అతనిలోనే ఉంది. గత తప్పుల పాపాన్ని పూర్తిగా పరిహారం చేసుకోలేకపోవచ్చేమో కాని, అవి ఎందుకు సంభవించాయన్న నిజాన్ని తెలుసుకుని అనవసర ప్రతిఘటనలకు పోకుండా స్వీకరించి తన శక్తిని వృథా పోనీయకుండా కాపాడుకోగలడు. ఈ నిజాన్ని గుర్తించినప్పుడు ఈ పరిణామాలన్నింటినీ మనిషి చిరునవ్వుతో ఆహ్వానించగలడు. వాటి నుంచి పాఠాన్ని నేర్చుకోగలడు. ప్రకృతి నియమాన్ని అర్థం చేసుకున్న మనిషి ఈ వచ్చిపోయే అనుభవాలన్నింటినీ ఆశీర్వాదంగా స్వీకరించగలడు. ప్రాచ్యదేశాలలో అత్యంత మూఢులుగా పరిగణించబడే వారి జీవితాలలో సైతం ఈ సత్యం ప్రస్ఫుటంగా ప్రతిఫలిస్తుంది. బాధలలో ఉన్నప్పుడు సైతం



వారు తమ జీవితాలలో నిరాశానిస్పృహలకు చోటివ్వరు. ఎందుకంటే ఈ కష్టాలు ఎల్లకాలం నిలిచి ఉండేవికావని వారికి తెలుసు. దురదృష్టం అనేది కదిలిపోయే మేఘం వంటిదని, అది త్వరలోనే అదృశ్యమై పోతుందని, తమ స్వీయకర్మల ఫలితమే ఈ స్థితి అని, పరిమితమూ, స్వల్పమూ అయిన కారణాలు అపరిమితమైన ఫలితాలను జనింపచేయలేవని వారు స్పష్టంగా ఎరిగి ఉంటారు.

ఈ ప్రకృతి నియమాన్ని తెలుసుకొన్నప్పుడు ఎటువంటి పరిస్థితులనైనా మనం ధైర్యంగా ఎదుర్కొని నిలబడగలం. మన ఓపిక, మనోస్థైర్యం మరింత వృద్ధి చెందుతాయి. అప్పుడు తాటాకు చప్పుళ్ళకు మనమెంత మాత్రమూ భయపడం. ఈ నియమానికి భిన్నంగా ఏదీ జరగదని తెలిసినప్పుడు మనమెందుకు ధైర్యాన్ని కోల్పోయి అశాంతిగా తయారవ్వాలి. ఒకవేళ దీనికి భిన్నంగా ఏదైనా సంభవిస్తే దాని వెనుక ఏదో నిగూఢార్థమూ ప్రత్యేక ప్రయోజనమూ ఇమిడి ఉండాలి. మంచివారెప్పుడూ కష్టాలకు గురవుతుంటారు. చెడ్డవారు మాత్రం నిక్షేపంగా ఉంటారనేది మనకు తరచుగా వినబడే మాట. దీనర్థం ఏమిటి? పరమ లౌకికులు, స్వార్థపరులూ అయినవారు అపరిమితమైన భౌతికసుఖాలను, సదుపాయాలను

అనుభవిస్తుండటం వలన వారిని అధిక అదృష్టవంతులందామా? ఈ జన్మలో మనం ఆశించేది తుచ్ఛమైన ఈ భౌతికసుఖాలనా? అవి ఎంత మాత్రమూ మానవజీవిత చరమలక్ష్యం కానేరదు, కాకూడదు. ఈ సుఖదుఃఖాలనే ద్వంద్వాలకు అతీతంగా ఎదిగి, ఎదురయ్యే ప్రతిదానిని సమభావంతో స్వీకరించాలి. ఈ ప్రయాణంలో ఎదురయ్యే ప్రతీ అనుభవాన్ని కూడా మనలోని ఉన్నత దైవీ ప్రకృతిని బహిర్గతం చేసి, మన ఆధ్యాత్మిక శక్తిని పెంపొందింపజేసే ప్రేరకంగా భావించాలి.

కర్మసిద్ధాంతాన్ని సక్రమంగా అవగతం చేసుకోవడం ద్వారా మార్గమధ్యంలో తప్పులు చేయకుండా సక్రమంగా సాగిపోతూ తుదకు గమ్యాన్ని చేరుకోగలం. ఒకవేళ ఏదైనా పొరపాటు చేసినట్లైతే దాని ఫలితాన్ని తప్పక అనుభవించాలి. నిప్పులో చెయ్యిని కావాలని పెట్టినా, పొరపాటున పెట్టినా చెయ్యి కాలి తీరుతుంది. మనం చేసిన పనులకు తగ్గట్టే ఫలితాలు ఉంటాయి. వీటినుంచి మనం నేర్చుకునేదేమిటి? మూర్ఖపు పనులను పునరావృతం చేయకూడదనే. తెలిసి చేసినా, తెలియకచేసినా మనం చేసిన ప్రతీ పనికి, వేసే ప్రతీ అడుగుకూ, మాట్లాడే ప్రతీ మాటకూ వాటి స్వభావాన్ని బట్టి ప్రతిక్రియ ఉంటుంది. ఆ ప్రతిక్రియ మంచైనా, చెడైనా



స్వీకరించక తప్పదు. అప్రయత్నంగా చేసిన పనుల ఫలితాలను తప్పించుకోవడం ఎలా? భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఈ విధంగా ఉపదేశిస్తాడు: "నువ్వు ఏ పని చేసినా, ఏది భుజించినా, ఏ జపతపాలు ఆచరించినా, ఏ దానమొనర్చినా, సమర్పణ భావంతో అంతా భగవంతుడికి ధారపొయ్యి. ఈ సమర్పణ భావంతో ఏ పని చేసినా నువ్వు కర్మ బంధాల నుంచి పూర్తిగా బయటపడగలవు." ఇంకో విధంగా చెప్పాలంటే భగవంతుడిని పూర్తిగా శరణుజొచ్చితే, మనల్ని కట్టిపడవేసే బంధాల నుంచి పూర్ణ విముక్తి సులువుగా పొందగలం. ఈ భావనతో పనిచేయగలిగితే, కమలం నీటిలో ఉన్నప్పటికీ ఆ నీటిచే ఏ విధంగా తడవబడకుండా తేలుతుందో, మనం ప్రపంచంలో ఉన్నప్పటికీ ఆ ప్రాపంచికతను అంటించుకోకుండా తప్పించుకోవచ్చు. ఈ విధంగా జీవితం అంటే ఏమిటి, దానికి ప్రకృతితోటి, సోదర మానవులతోటి, భగవంతుడి పట్ల ఎటువంటి సంబంధం ఉన్నది అన్న విషయాన్ని స్పష్టంగా గమనించగలిగినప్పుడు మనం ప్రతి విషయాన్ని నవీన సానుకూల దృక్పథంతో చూడగలుగుతాం. ప్రతి దానినీ విమర్శించాలనే భావన మనలో నుంచి తొలగిపోతుంది. మంచివారు బాధలు పడుతుండగా

చూసినా, వారు ఏ కారణం లేకుండా ఆ బాధలు అనుభవిస్తున్నారని ఇంక ఎంతమాత్రమూ భావించబోము. ప్రపంచంలో అసలు న్యాయమనేది లేదు అంటూ ప్రతిక్రియగా తిరుగుబాటు కూడా చేయబోము. కేవలం అజ్ఞానంలోంచి మాత్రమే ఇటువంటి తిరుగుబాటు ప్రేరణ జనిస్తుంది.

అనుల్లంఘనీయమైన విధితో కర్మసిద్ధాంతాన్ని పోల్చిచూసి గందరగోళంలో పడకూడదు. విధి అనుభవించి తీరవలసిందే అన్న భావన మనిషిని హృదయవేదనకు గురిచేస్తుంది. దీనికి భిన్నంగా, "ఏ స్థితీ శాశ్వతం కాదు, మనిషి కనుక తను గతంలో చేసిన పాపకర్మల ఫలితాన్ని తప్పించుకోవాలని భావిస్తే, అతడు తన శక్తియుక్తులను సన్మార్గంలో ప్రవేశపెట్టి గత తప్పుల పాపఫలాన్ని పరిహారం చేసుకోవచ్చు" అని కర్మసిద్ధాంతం నొక్కి వక్కాణిస్తుంది.

"గతం గతః, దానిని విచారించి లాభం లేదు. నీ జీవితమంతా కష్టాలతో కూడుకున్నదైనప్పటికీ, వాటిని నెమరువేసుకొని లాభం లేదు. మనస్ఫూర్తిగా, త్రికరణశుద్ధితో అచరించగలిగే నీకు నచ్చిన ఒక ఆదర్శాన్ని ముందు ఉంచుకో. సదా దానిపైనే నీ మనస్సును లగ్నం చేయి, నీ శక్తియుక్తులన్నీ దాన్ని సాధించడానికే వెచ్చించు. త్వరలోనే



నీ బలహీనతలనుంచి, లోపాలనుంచి ముక్తిని పొందగలవు" అంటూ అది మనిషిని వెన్నుతట్టి నడిపిస్తుంది.

ఒక చెడు లక్షణం అలవడినా; అసూయ, అసహ్యం, ఏవగింపు వంటివి మన హృదయాన్ని దహించివేస్తున్నా, వాటిని త్వరగా రూపుమాపడానికి, మన మనస్సును ఒక ఉన్నత ఆదర్శం వైపు మళ్ళించడమే సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. అది కాకుండా వాటిని నేరుగా ఎదుర్కొని, ఆలోచించినకొద్దీ వాటిని మనం మరింత శక్తిమంతంగా చేస్తున్నట్లే లెక్క. అప్పుడప్పుడూ మన జీవితమూ, శక్తి, అవగాహనా సామర్థ్యమూ చాలా పరిమితంగా అనిపించి నిరాశా నిస్పృహలకు లోనవుతుంటాం. కాని వాటిని సాధ్యమైనంతమేరకు మరచిపోవడానికి ప్రయత్నిస్తూ మన ఆలోచనాస్రవంతిని ఉన్నతమైన, ఉదాత్తమైన ఆలోచనల దిశగా మరల్చాలి. ఉన్నతస్థాయిలో ఉన్నామా, లేక నిమ్నస్థాయిలో ఉన్నామా అనేది నిజంగా అప్రస్తుతం. ఎందుకంటే మనమందరమూ పరిణామక్రమంలోని ఒక్కొక్క దశను దాటే క్రమంలో ఉన్నవారమే. నేడో, రేపో మనందరం పూర్ణత్వ స్థితిని చేరుకోక తప్పదు. ఇది తథ్యం.

తోటివారు నిరాశామయస్థితికి లోనయినప్పుడు వారికి భవిష్యత్తుపై ఆశను, ప్రోత్సాహాన్ని కల్పించే ప్రయత్నం

చేయాలి. మనిషి నిస్సహాయపరిస్థితులలో పడి గుండె దిగజారి కూలబడిపోయినప్పుడు, ఒక్క చిన్న ఆశాభరితమైన మాట, సానుభూతి వానిని పునరుత్తేజితుడిని చేసి నిలబెడుతుంది. తోటివారి బలహీనతలను ఏకరువు పెడుతూ, వారి తప్పులను ఎత్తిచూపే పని చాలా తేలికగా చేస్తూ ఉంటాం. కాని మనలో కూడా బుద్ధునిలా, క్రీస్తులా రూపొందగల శక్తి సామర్థ్యాలు ఉన్నాయనే నమ్మకాన్ని, విశ్వాసాన్ని తోటివారి హృదయాలలో నాటగలిగినవాడే నిజమైన స్నేహితుడు.

మన గమ్యం మన చేతుల్లోనే ఉంది. దానిని మనం సంకల్పించినట్లు మలచుకోగల శక్తీ మనలోనే ఉంది. కాబట్టి మన బాధలన్నిటికీ మూలకారకాలై, మన స్వభావంలో భాగంగా కనిపిస్తున్న అపరిపక్వతలన్నింటినీ క్రూకటివ్రేళ్ళతో సహా పెకలించివేయడానికి ఓపికగా, పట్టుదలగా, త్రికరణశుద్ధితో శక్తివంచనలేకుండా పాటుపడదాం. సద్భావనతో, సత్కార్యాచరణతో మన మార్గాన్ని మూసివేసే ప్రతీ ఒక్క అడ్డంకినీ తొలగించుకుని మనతోపాటు మన తోటివారి జీవితాలను కూడా నిత్యానందమయం చేసుకుందాం.

# పునర్జన్మ - పరిణామక్రమం

సంక్లిష్టమైన మానవ మనుగడ రహస్యాన్ని కనుగొని వివరించడం అంత తేలికైనదేమీ కాదు. మానవ జీవిత రహస్యాలను అధ్యయనం చేయడాన్ని మించిన ఆసక్తికరమైన విషయం వేరొకటి ఉండదు. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మానవుడు లౌకిక, ఆధ్యాత్మిక జగత్తులు రెంటినీ శోధించ పూనుకున్నాడు. మానవజాతి ఎప్పుడు, ఏ విధంగా మనుగడలోకి వచ్చింది? మరణానంతరం జీవికి సంభవించే పరిణామాలు ఏమిటి? వంటి వాటిని అన్వేషించి, అర్థం చేసుకోవడానికి ఉత్సుకత మొదలైంది. ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలలో భాగంగా వెలువడిన డార్విన్ జీవపరిణామక్రమ సిద్ధాంతం జీవితరహస్యాన్ని అన్వేషించే పరిశోధనలకు ముగింపు పలుకగలదని అనేకులు భావించేటట్లు చేయగలిగింది. కాని పశ్చిమదేశాలలో వెల్లడించబడిన ఈ సిద్ధాంతం మనం ఆశించిన సంతృప్తికరమైన వివరణను ఇవ్వలేకపోయింది. పశ్చిమదేశాల శాస్త్రజ్ఞుల ప్రకారం, అస్తిత్వాన్ని నిలుపుకునే పోరాటంలో ప్రతీ జీవి ఎంతో కొంత పరిణామం

చెందుతుంది. ఈ క్రమంలో ఎదురయ్యే అడ్డంకులన్నింటినీ అధిగమించే శక్తిని సంతరించుకొనేంతవరకు అది తన ప్రయాణాన్ని ఆపదు. అస్తిత్వ పోరాటంలో వ్యతిరేకతలను తట్టుకుని నిలబడగల జీవే మనుగడ సాగించగలదు అన్న సూత్రాన్ని అనుసరించి, సూక్ష్మాతిసూక్ష్మమైన జీవి నుంచి మనిషి వరకూ ప్రతీ ఒక్క జీవరాశి అంతర్నిహితమైన స్వాభావిక ప్రేరణచే తన జీవితాన్ని వికసింప జేసుకోవడానికే ప్రయత్నిస్తుంది. శరీరం ఒక్కొక్క దశను దాటుకొని వృద్ధి చెందుతూ ఇంక పెరుగుదల అంటూ లేని పరిపూర్ణ స్థితిని ఏ విధంగా చేరుకొంటుందో నిరూపించే ప్రయోగాలు అనేకం జరిగాయి.

ఈ జీవ భౌతిక పరిణామక్రమానికి సంబంధించిన వివరణ మనకు పూర్తి సంతృప్తిని ఇవ్వలేదు, ఎందుకంటే ఇది భౌతికాతీతమైన ఉన్నతశ్రేణి వ్యక్తీకరణలకు సంబంధించిన పరిణామాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పాశ్చాత్య పరిణామవాదులకు భిన్నంగా, క్రీస్తు పూర్వం 7వ శతాబ్దంలో భారతదేశంలో వసించిన కపిలుడు వంటి వారు తమ భావనలను భౌతిక జగత్తును అధిగమించి నైతిక, ఆధ్యాత్మిక పరిణామాలను కూడా వివరించే విధంగా విస్తరింపజేశారు. ఈ ప్రాచీన ఋషులు లయం లేనిదే సృష్టి



వికాసం లేదని గ్రహించారు. ఆధునిక విజ్ఞానశాస్త్ర ధృవీకరణ ప్రకారం ఏ వస్తువూ శూన్యంలోనుంచి జనించదు. అదే విధంగా ఈ సృష్టి పరిణామానికి ముందస్తుగా సర్వం లయించి పోయి ఉండాలి తప్ప శూన్యం ఉండి ఉండదు. కార్యకారణ సంబంధం లాగానే సృష్టి, లయాలు కూడా విడదీయరానివే. లయం లేనిదే సృష్టి ప్రారంభం కాదు. ఫలితాన్ని గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే అందుకు దారితీసిన కారణాలు కూడా తెలుసుకుని ఉండాలి. అదేవిధంగా ప్రస్తుత సృష్టి పరిణామక్రమాన్ని తెలుసుకోవాలంటే, అంతకు పూర్వం దానికి దారితీసిన పరిస్థితులు కూడా తెలుసుకుని తీరాలి. అదే విధంగా ప్రస్తుత మన ఈ భౌతిక మానసిక స్థితి కూడా యాదృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. అది గత పరిణామాల ఫలితమే.

గతంతో అనుసంధానం లేనిదే వర్తమానాన్ని వివరించలేం. అదేవిధంగా వర్తమానంతో సంబంధం లేకుండా భవిష్యత్తును వివరించలేం. జీవిత పరిణామమంతా క్రమానుగత గొలుసుకట్టు సూత్రం లాంటిదే. ఒకదానితో సంబంధం లేకుండా ఇంకోదానిని అర్థం చేసుకోలేము. ధైర్యసాహసాలు కలిగిన మహాత్ములు కొందరు అజ్ఞానపు మేలిముసుగును తొలగించుకుని ఈ నియమాన్ని అర్థం

చేసుకున్నారు. ఈ నియమాన్ని గ్రహించగలిగితే లోకంలో ఉన్న వైవిధ్యాలను, అసమానతలను మనం మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాం. మనుషులందరూ ఒకేలా ఎందుకు ఉండరు? దయాళువైన భగవంతుడు ఒకడిని అదృష్టవంతుడిగా మరొకడిని దీనుడిగా సృష్టిస్తాడా? ఈ వైవిధ్యాన్ని కల్పించేది ఏది? కారణం లేనిదే ఫలితం లేనట్లే, ఈ బాహ్య స్థితులలో, మానసికశక్తులలో మానవుల మధ్య గల వ్యత్యాసాలు ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాలలో నిబిడీకృతమై ఉన్న లక్షణాల మధ్యగల భేదాల ఫలితమే.

స్థూలశరీరమే సర్వం కాదు. సూక్ష్మాతిసూక్ష్మమైన అణువులతో కూడిన సూక్ష్మశరీరం కూడా మనిషికి ఉంటుంది. మనస్సు, బుద్ధి, అహంల కలయికే ఈ సూక్ష్మశరీరం. జన్మ జన్మాంతరాల నుండి పోగుకాబడిన వృత్తులన్నీ ఈ సూక్ష్మశరీరంలో క్రోడీకరించబడి ఉంటాయి. మనిషి వ్యక్తిత్వానికి ఆవాసస్థానమైన ఈ సూక్ష్మభాగాన్ని తెలుసుకోవడం ద్వారా అతని పరిణామక్రమానికి సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలను గ్రహించవచ్చు. తద్వారా ప్రతి ఒక్కని జీవితం వేరొకని జీవితం నుంచి భిన్నంగా ఎందుకు ఉంటుందో తెలుసుకోవచ్చు. తెలిసో తెలియకో ఈ తేడాలను మనకు మనమే



సృష్టించుకుంటున్నాం. మనం ఊహించుకుంటున్నట్లు మన విధి ఏ మానవాతీత శక్తి నియంత్రణలోనూ లేదు. మనం అనుభవించే సుఖదుఃఖాలన్నీ ఏ నిరంకుశ దైవదూతా మనమీద రుద్దలేదు. అవి స్వీయ ఆలోచనల, చేతల సహజ సిద్ధ పరిణామాలు. నాటిన విత్తుకు తగ్గ పంటనే పొందుతాం. మనకు ప్రాప్తం లేని దానినెవరూ మనదరికి చేర్చలేరు. అదే విధంగా మనం అర్హమైన వాటిని మన దరికి చేరకుండా కూడా ఎవ్వరూ ఆపలేరు.

మన భవిష్యత్తును తీర్చిదిద్దుకునే శక్తి మనలోనే ఉంది. లోపభూయిష్టమైన వ్యక్తిత్వంతో జన్మించడం, దుర్భర పరిస్థితుల మధ్యకు నెట్టివేయబడటం వంటివన్నీ గత తప్పుల ఫలితమే అయి ఉండవచ్చు, వాటిని మనం తప్పించుకోలేక పోయి ఉండవచ్చు. వాటికి విరుగుడు మన ప్రస్తుత జీవితాన్ని మలుచుకోవడంలోనే ఉంది. వర్తమాన జీవితాన్ని వివేచనతో గడపడం ద్వారా భూతకాలపు పొరపాట్ల ఫలితాన్ని సునాయాసంగా అధిగమించవచ్చు. ఒక వ్యక్తి తనకంటూ ఈ జీవితంలో నిర్దేశించబడిన కార్యాలను పూర్తి చేయకుండగానే, తన లక్ష్యాన్ని చేరకుండానే మరణిస్తే, దానితో అంతా ముగిసినట్లేనా? ఇక అతనికి మరో అవకాశం ఉండదా? దీనికి భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ

సమాధానాన్ని ఇస్తాడు: "అతనికి ఈ జన్మలో కాని, మరుజన్మలో కాని వచ్చిన నష్టమేమీలేదు. సత్కార్యాలు చేసినవాడు ఎన్నటికీ దుర్గతిని పొందడు. గతజన్మలలో గడించిన జ్ఞానాన్ని మరుజన్మలో తిరిగి పొంది తన లక్ష్యాన్ని చేరడానికి శ్రమిస్తాడు. గత జన్మల సంస్కారబలంచే తిరుగులేని విధంగా ముందుకు పురోగమిస్తాడు. ఆ విధంగా ఈ జన్మల పరంపరలో పవిత్రతనొంది తుట్టతుదకు గమ్యాన్ని చేరుతాడు."

ఇప్పుడొక ప్రశ్న తలెత్తుతుంది. మనం ఈ జన్మకంటే ముందు జీవించి ఉంటే, అది మనకు ఎందుకు గుర్తుండటంలేదు? బాల్యంలో జరిగిన అనేక విషయాలు మనకు ఇప్పుడు జ్ఞప్తిలో ఉండకపోవచ్చు. అంతమాత్రం చేత అప్పుడు మనం జీవించలేమని చెప్పలేము కదా! మన జ్ఞాపకశక్తి శుద్ధ సహజస్థితిలో లేదు. గతంలోకి చొచ్చుకుపోయేంత ఏకాగ్రతను, శ్రద్ధను మన మనస్సు ప్రస్తుతం సంతరించుకోలేదు. అందుచేత ప్రస్తుత స్థితిలో మన జ్ఞానం పరిమితమే, మన జ్ఞాపక శక్తి అస్పష్టమే. కొందరు తమ బాల్యంలో జరిగిన అతిచిన్న సంఘటనను కూడా కచ్చితమైన వివరాలతో జ్ఞప్తిలోకి తెచ్చుకోగలరు. మరికొందరు సంవత్సరం క్రితం జరిగిన సంఘటనను,



అంతెందుకు గడచినరోజులో జరిగినదాన్ని కూడా జ్ఞప్తిలోకి తెచ్చుకోలేరు. మానవ మనస్సులు ఏ విధంగా భిన్నంగా ఉంటాయో ఇది నిరూపిస్తుంది. మహాత్ముల జీవితాలను పరిశీలిస్తే ఈ జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకోవచ్చని తెలుస్తుంది. ఉదాహరణకు బుద్ధుడు తన పూర్వజన్మలను జ్ఞప్తిలోకి తెచ్చుకోగలిగాడు. అదే విధంగా పవిత్ర ధ్యానమయ జీవనాన్ని గడిపిన యోగులెందరో తమ గత జన్మల స్మృతులను పొందగలిగారు. ఇటువంటి జీవనం ద్వారా మనస్సు శుద్ధ స్ఫటికంలా రూపొంది ప్రతీ విషయాన్నీ స్పష్టంగా ప్రతిఫలింప చేస్తుంది.

మన బంధనాలకు కాని, స్వేచ్ఛకు కాని మనస్సే మూలకారణం. ఫలించని కోరికలే, కొత్త జన్మనెత్తి వాటిని తీర్చుకునే విధంగా మనిషిని ప్రేరేపిస్తుంటాయి. కోరికలే కొత్త జన్మలకు బీజాలు. ఆ కోరికల స్వభావాన్ని బట్టి మన భవిష్యత్తు నిర్దేశించబడుతుంది. "ప్రాణోత్క్రమణ సమయంలోని మానసికస్థితిని అనుసరించే అతని తదుపరి మజిలీ ఉంటుంది" అని మనం గీతలో చదివి ఉన్నాం. ఇంకో విధంగా చెప్పాలంటే తన జీవితకాలంలో సుదీర్ఘ సమయంపాటు మనిషి మానసంలో మెదలిన ఆలోచనలకు తగ్గ స్థితినే తదనంతరం పొందుతాడు. తన అలవాట్లచే

మానవ మానసం సృష్టించుకున్నదానికంటే భిన్నమైన దానిని ఏదీ మనిషి పొందడు. అతను అన్యమైన దేనినో వాంఛించి ఉండవచ్చు. కాని అతను ప్రయత్నపూర్వకంగానో లేక అప్రయత్న పూర్వకంగానో చేసిన ఆలోచనలు, చేతలవల్ల ఏర్పడిన అతని సహజాతమైన ప్రవృత్తి అగ్రస్థానం వహించి, అతనిని తదనుగుణమైన దిశకు నడిపిస్తుంది. ప్రస్తుత గమనాన్ని కనుక మార్చుకోవాలని మనం వాంఛిస్తే, గతానికి పరిహారంగా మనల్ని నూతన దిశగా నడిపించే ఆలోచనలను అలవరచుకోవాలి.

మనకు నిజంగా కావల్సినదేమిటి? మనకు తాత్కాలికమూ, క్షణభంగురమూ అయినది కావాలా లేక శాశ్వతమైనది కావాలా? ఈ జనన-మరణ చక్రంలో పరిభ్రమిస్తూ సంతృప్తి చెందుదామా! శరీరంతో తాదాత్మ్యం చెందుతూ, ఈ జన్మలో లభించే అల్ప సుఖాలతో సంతృప్తి చెంది, దీనికి అతీతమైన స్థితిని పొందకుండా ఇంతటితో ఆగిపోదామా? ఆ అతీత స్థితిని పొందాలని కోరుకున్నట్లయితే, దానిని సాధించడానికి శ్రమించాలి. మనలో అంతర్నిహితమై ఉన్న శక్తులన్నిటినీ వెలికితీయాలి. స్వీయ స్వభావాన్ని గుర్తెరిగే ప్రయత్నం చేయాలి. నైతిక, ఆధ్యాత్మిక పరివర్తన ద్వారా మాత్రమే మనిషి పూర్తి స్వేచ్ఛను



పొందగలడు. మనిషి నిరంతరం దేనికొరకై చింతన చేస్తూ, పరిశ్రమిస్తుంటాడో చిట్టచివరకు దానిని పొందగలుగుతాడు. భౌతిక సంపదలకై నిరంతరం శ్రమిస్తే చివరకు వాటినే పొందుతాడు. తనలోనే నిక్షిప్తమై అంతర్నిహితమూ, సర్వశక్తిమంతమూ, అనశ్వరమూ అయినటువంటి స్వీయ ప్రకృతిని వెలికి తీయనిదే మనిషి ముక్తుడు కాలేడు.

జీవితం నాశరహితమైనది. అది ఈ ఒక్క జన్మలోనే ఆరంభమై ముగిసిపోయేది కాదని ఎంతోమంది ఋషులు, తత్త్వవేత్తలు గుర్తించారు. అది శాశ్వతంగా నిలిచి ఉండేది, ఉంటుంది. పరిణామక్రమంలో పరిపూర్ణత్వాన్ని కేవలం ఒక్క జన్మలో చేరుకోలేం. ఆ సమయం కూడా బహుస్వల్పం. పూర్ణత్వాన్ని సాధించడానికి సరిపడినంత అనుభవాన్ని, జ్ఞానాన్ని ఆత్మ సంపాదించుకోలేదు. అందుకే అది మరల, మరల జన్మలనెత్తి అనుభవాన్ని గడిస్తుంది. అందుకే జర్మనీ తత్త్వవేత్త లెస్సింగ్ ఇలా అంటారు: "కొత్త జ్ఞానాన్ని, సరికొత్త అనుభవాలను గడించడానికి నేను మరల మరలా ఈ భూమి మీదకు ఎందుకు రాకూడదు. కేవలం ఒక్కసారికే ఇంక మరలా తిరిగి రాలేనంతగా ఏమైనా కొనిపోతున్నానా!"

జీవపరిణామ క్రమ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతాలు జీవితరహస్యాన్ని సవివరంగా తెలియజేస్తాయి. వాటిని కనుక

అర్థం చేసుకోగలిగితే ప్రస్తుత పరిస్థితుల పట్ల మనకు ఎటువంటి విముఖతా ఉండదు. తిరుగుబాటు తత్త్వం బాధల నుంచి, అజ్ఞానం నుంచి ముక్తి పొందడానికి మనకు ఏమాత్రమూ సహకరించదు. పరిస్థితులను అర్థం చేసుకుని మార్గాంతరం కొరకు శ్రమించడం ద్వారా మాత్రమే ముక్తులవ్వగలం. జీవితాన్ని మన తెలివితేటలతో సక్రమంగా తీర్చిదిద్దుకోవడం నేర్చుకున్నప్పుడు దానిని వరప్రసాదంగా భావించగలుగుతాం. ఎందుకంటే మానవ జీవితం ద్వారానే భగవంతుడి దివ్యత్వం ప్రకటితమవుతుంది. సృష్టి పరిణామపు ముఖ్యోద్దేశం కూడా అదే. ప్రపంచంలోని ప్రతి ప్రాణీ భగవంతుడి సృష్టే. అలాగే ప్రతీ ప్రాణి ఈ పరిణామ క్రమంలో తుట్టతుదకు తన మూలస్థానమైన ఆ భగవంతునిలో ఐక్యం కావాల్సిందే. తృప్తిపరచబడనటువంటి కోరికలతో పీడించబడుతూ అనేక మంది జనులు గాలివాటు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అటువంటి కోరికలను తృప్తి పరుచుకోవడానికి ప్రయత్నించడమంటే అగ్నిలో ఆజ్యం పోసినట్లు ఉంటుంది. జీవితంలోని ప్రతీ అడుగునా విచక్షణను ఉపయోగించాలి. మనకేమి కావాలో, దానిని మనకు ఇవ్వగలిగినదేదో మనల్ని మనం ప్రశ్నించి తెలుసుకోవాలి. అంతేకాకుండా మన ఈ జీవితం ఏదో



యథాలాపంగా, యాదృచ్ఛికంగా ప్రసాదించబడలేదు. మనం అనుకుంటున్నట్లుగా ఇది క్షణభంగురమూ, తాత్కాలికమూ కాదు. ఇది ఈ ఒక్క జన్మతో ముగిసిపోయేదికాదు, శాశ్వతంగా నిలిచి ఉండేది అన్న విషయాన్ని స్ఫురణలో ఉంచుకోవాలి.

మన ఉనికి శాశ్వతమైనదన్న నమ్మకం, మనలను ఈ భౌతికస్థాయి నుంచి ఉన్నతమైన స్థితికి లేవదీసి, ఈ లోకంలో మనం నిర్వర్తించవలసిన కర్తవ్యాలకు తగిన శక్తిని అందించి, జీవితాన్ని ఉత్తమంగా గడిపేటట్లు చేస్తుంది. దీన్ని అర్థం చేసుకున్న మానవుడు ఇక జీవించడానికి ఎంతమాత్రమూ భయపడడు. ఈ జీవనం నుంచి తప్పించుకు పారిపోవాలని చూడడు. ఆత్మహత్యలు చేసుకున్న వారందరూ జీవితం మీద ప్రేమలేక ఆ విధంగా చేసుకున్నారనుకుంటున్నారా? కానేకాదు. జీవితంలోని బాధలు, బంధాలు, బానిసత్వం నుంచి తప్పించుకోవడానికి అజ్ఞానం చేత వారు ఆ విధంగా చేస్తున్నారు. కాని వారు తప్పుడు మార్గాన్ని ఎన్నుకుంటున్నారు. దేనినైతే సాధనంగా గైకొని తమ స్వస్వరూప జ్ఞానాన్ని పొంద ప్రయత్నిస్తున్నారో అటువంటి సాధనమైన శరీరాన్ని వారు నశింపజేసుకుంటున్నారు. ప్రాణమున్న ప్రతీ జీవి జీవితాన్ని

అసహ్యించుకోదు, దాని నుంచి పారిపోవాలని కోరుకోదు. మరణాన్ని తప్పించుకోవాలనే మనందరమూ కోరుకునేది. మనం ఆధ్యాత్మికంగా పరిణతి చెందనంతవరకూ ఈ చిట్టచివరి శత్రువైన మరణాన్ని అధిగమించలేము. అనంతత్వానికి పరిధులు లేవు. పరిధులకు కట్టుబడిన మానవుడు తన అనంతత్వాన్ని గుర్తెరిగినప్పుడు అన్ని రకాల బంధనాలను ఛేదించుకుని మృత్యురాజ్యాన్ని కూడా దాటిపోతాడు.

పునర్జన్మ భావన మనలోని అసహనాన్ని, అసంబద్ధపు ఆలోచనలను దూరం చేస్తుంది. ఎందుకంటే ఏదో కొద్ది సంవత్సరాలలో మనం నెరవేర్చవలసిన సకల కార్యాలు పూర్తి చేయమని నిరంకుశంగా మనలను ఈ భూమిమీద ప్రవేశపెట్టలేదని, ఈ జన్మలో కాకపోతే మరుజన్మలో అసంపూర్తిగా వదలివేయబడినటువంటి కార్యాలను చేపట్టే అవకాశం లభిస్తుందని, తద్వారా మిగిలిపోయిన కోర్కెలను తీర్చుకుంటూ జీవితపు పూర్ణత్వాన్ని అన్ని దిక్కుల నుంచీ ఆస్వాదించే అనుభవం లభిస్తుందనే ఆశ్వాసనను ఈ పునర్జన్మ భావన మనిషికి కలిగిస్తుంది. నిమ్నస్థాయి కోరికలకు బానిసలుగా జీవిస్తున్న అధిక సంఖ్యాకులైన అనేక జనులకు, తమ మరుజన్మకు సంబంధించిన పరిస్థితులపై గాని,



పరిసరాలపై గాని ఏ విధమైన నియంత్రణా ఉండదు. ఏ రకమైన జన్మనెత్తాలి అన్నదానిపై ఎటువంటి ఎంపికా ఉండదు. జన్మించిన పరిస్థితులకు ఒదిగి జీవించవలసిందే. తమను తాము నిమ్నస్థాయిలో పడవేసుకునే స్వయంకృతమైన అడ్డంకుల గొలుసుకట్టును వారికై వారే ఏర్పరచుకున్నారు. తమ ఆలోచనలను, కోరికలను పవిత్రీకరణ మొనర్చుకోవడం ద్వారా వారికై వారే ఈ అడ్డంకులను ఛేదించుకుని ఉన్నత జన్మల పరంపరలోకి అడుగుపెట్టగలరు.

ప్రతీ మర్త్యుడూ ఏదో ఒకనాటికి తన నిజ ఆధ్యాత్మిక తత్త్వాన్ని గుర్తెరగవలసిందే. అది సహజ పరిణామక్రమం ద్వారా సంభవించవచ్చు లేదా ప్రకృతి ఆఘాతాల వల్ల హఠాత్పరిణామంగా కూడా సంభవిచ్చవచ్చు. కాబట్టి మానవ జీవితంలో మనకు ఎదురయ్యే కష్టాలను శాపంగా చూడరాదు. ఒక్కొక్కసారి ఈ కష్టాలు, బాధల నుంచి మనం అద్భుతమైన వరాలను పొందుతాం. ఈ నియమాన్ని అర్థం చేసుకున్నవాడు తన దురదృష్టానికి ఇంక ఎంతమాత్రమూ చింతించడు. ఈ లోకంలో అతను ప్రశాంతంగా జీవిస్తాడు. నిశ్చిత ప్రయోజనం లేనిదే ఏ కార్యమూ సంభవించదు. సుఖము-దుఃఖము, జయము-అపజయము వంటి

అనుభవాలు అతని వృద్ధికే తోడ్పాటును అందించి, అతనిలోని ఉన్నత ప్రవృత్తుల వికాసానికి దోహదంచేసి తుదకు ఆ మానవుడు పూర్ణత్వాన్ని పొందేటట్లు చేయగలవు. కాబట్టి మనలోని ప్రతీ ఒక్కరమూ ఇకనైనా ఆనందంగా, స్ఫూర్తి ఎరుకతో బాధ్యతాయుతమైన జీవితాన్ని గడుపుదాం. జీవితాన్ని నిరాశానిస్పృహలతో భారంగా చేసుకోకుండా ఉందాం గాక. మొక్కవోని దీక్షతో, ఉత్సాహం పరవళ్ళు త్రొక్కే హృదయాలతో మన నిజతత్త్వమైన ఆత్మను అనుభవంలోకి తెచ్చుకునేవరకు పని చేస్తూ ఉందాం గాక.

# పునరుత్థానం - అమరత్వం

ఈ సృష్టి దేని అభివ్యక్తీకరణమో, దేని చేత ఈ సృష్టి అంతా వ్యాప్తి చెందిందో, ఆ మహా వస్తువు నాశరహితమైనదన్న విషయాన్ని తెలుసుకోండి. జీవునిలో స్థిరనివాసం ఏర్పరచుకున్న మార్పు అంటూ లేనటువంటి ఆ అంతరాత్మను ఎవరూ నాశనం చేయలేరు. ఈ శరీరానికి ఆద్యంతాలు, చావుపుట్టుకలు ఉంటాయి. కాని అందులో వసిస్తున్న ఆ ఆత్మకు చావులేదు. తన అంతరాత్మను నశ్వరమైనదిగా భావించేవాడు, దాని నిజ స్వరూపాన్ని తెలుసుకోనట్లే లెక్క. అది పుట్టలేదు, ఎన్నటికీ చావదు కూడా. ఏదో కొంతకాలం ఉండి మాయమైపోయేది అంతకంటే కాదు. అది శాశ్వతమైనది. శరీరం మార్పు చెంది నశించిపోవచ్చు, ఆత్మ మాత్రం మార్పులేనిది, మరణం లేనిది. ఆత్మ స్వభావాన్ని ఎరిగినవాడు దేని గురించైనా ఎందుకు బాధపడాలి? తేలిపోయే మబ్బుల లాగా వచ్చిపోయే ఈ పరిస్థితులకు ఎందుకు ఆక్రోశించాలి? అవి మన ఆత్మను అంటనే అంటవు. మనిషి చిరిగిన వస్త్రాలను పారవేసి నూతనవస్త్రాలను ధరించినట్లే, ఆత్మ కూడా జీర్ణమైన శరీరాన్ని వదిలివేసి క్రొత్త శరీరాన్ని ధరిస్తుంది. అది కత్తి

చేత ఖండింపవేయజాలనిది, అగ్ని చేత దహింపబడనిది, వాయువు చేత ఆర్పివేయబడనిది, నీటి చేత తడిపివేయబడనిది. అది నాశరహితమైనది. ఈ విషయాన్ని తెలుసుకున్ననాడు ఇక మరణం గురించి ఎందుకు భయపడాలి? ఈ శరీరాలన్నీ నశ్వరాలే, కాని అందులో వసించేది మాత్రం అనశ్వరమైనది. కాబట్టి విజ్ఞులు మరణానికి భయపడరు, బాధపడరు.

ఈ విధంగా ఆత్మ నిజస్వభావాన్ని గురించి హిందూ ఆర్య ఋషులు, మహాత్ములు వేనోళ్ళ గుణగానం చేశారు. శరీర మరణాన్ని తట్టుకుని ఆత్మ నిలిచే ఉంటుందన్న విషయాన్ని గురించి ఆచరణాత్మక ఋజువు (ప్రత్యక్ష ప్రమాణం) లేనిదే, కేవలం వేరొకరి మాటల ద్వారా మనకు నమ్మకం కలుగదు. ఆత్మను చావు ఏమీ చేయలేదన్న విషయాన్ని నిరూపించడానికి ఏ అవతారపురుషుడో లేక ఇంకొకరో మరణశయ్యపై నుండి లేచి రావాలి, అంటే పునరుత్థానం జరగాలని ఎదురుచూస్తుంటాం. అందులో తప్పేమీలేదు. ఈ సత్యాన్ని ముఖాముఖి దర్శించనంతవరకు, ఉదాహరణ పూర్వకంగా ఋజువు చేసుకోనంతవరకూ, పదే పదే అనుమానపడుతుంటాం. ఒకవేళ దీనిని ప్రత్యక్షంగా దర్శించినా, త్వరగా మరచిపోవడం కూడా జరుగుతుంటుంది. ఈ కారణం చేతనే మనకు



ప్రపంచంలోని అన్ని దేశాలలో, అన్ని మతాలలో మరణాన్ని జయించిన కొందరు మహాత్ములు ప్రత్యక్ష ప్రమాణంగా నిలిచి అమరత్వానికి సాక్షీభూతులవుతున్నారు. మరణానంతరం పునరుత్థానం చెందడానికి ఏ ఒక్క అవతారపురుషుడి జీవితమో ప్రతీక కాదు. భారతదేశ చరిత్రలో ఎందరో ఋషులు, మహాత్ములు తమ మరణానంతరం కూడా పలుచోట్ల ప్రత్యక్షమవ్వడానికి సంబంధించిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. పునరుత్థానం, భారతీయ తత్త్వశాస్త్రాలలో అనాది నుంచీ ఉన్న చాలా పురాతనమైన భావన.

భారతదేశ చరిత్రలో కొంతమంది గతించిన మహాత్ములు తిరిగి అదే రూపంతో ప్రత్యక్షమవ్వడం వంటి అరుదైన సంఘటనలు కొన్ని చోటుచేసుకున్నాయి. ఇది ఏ విధంగా సాధ్యం? వారి శరీరాలు ఆధ్యాత్మిక యానంలో ఎంతో పవిత్రతను సంతరించుకుని ఆత్మతో అనుసంధానమై స్థూల భౌతికశరీరాన్ని నియంత్రించే నియమాలకు అతీతమై పోయాయి. అందువల్లనే ఈ అరుదైన సంఘటనలు సంభవించాయి. ఆధ్యాత్మిక జాగృతినొందని, స్థూల భౌతిక నియమాలకు లోబడి ఉన్న మాంసదేహాన్ని కలిగిఉన్న సాధారణ మానవులకు ఈ సూత్రం వర్తించదు. పునరుత్థానం అంటే మనిషి తిరిగి తన భౌతిక మాంసదేహంతో

ప్రత్యక్షమవుతాడు అన్న భావన కలిగి ఉన్నవారు నిరాశకు గురవ్వక తప్పదు. ఎందుకంటే ఈ భావన తర్కానికి కాని, మత, శాస్త్ర ప్రమాణాలకు కాని నిలువదు. ఈ శరీరం పదార్థ అణువుల సమ్మేళనం. ఈ సమ్మేళనం ఎప్పుడో ఒకప్పుడు విఘటనం చెందక తప్పదు. ఎందుకంటే అది పదార్థ నియమం కనుక. కాని ఈ స్థూల భౌతిక శరీరం లోపల ఇంకో శరీరం ఇమిడి ఉంది. అదే సూక్ష్మశరీరం. ఈ సూక్ష్మశరీరాన్ని మృత్యువు ఏమీ చేయలేదు. ఆత్మ ఈ స్థూల భౌతికశరీరాన్ని విడిచిపెట్టేటప్పుడు తనతో పాటు ఆ సూక్ష్మశరీరాన్ని కొనిపోతుంది. భారతీయ మనస్తత్త్వ శాస్త్రం ప్రకారం మనస్సు, బుద్ధి మరియు అహంకారాల సమ్మేళనమే సూక్ష్మశరీరం. పునరుత్థానం అంటే మృతశరీరం నుంచి లేచివచ్చి ఈ సూక్ష్మశరీరంతో ప్రత్యక్షమవ్వటమే. మానవుడు తన ఉనికికి సంబంధించిన ఈ సూక్ష్మరహస్యాన్ని తెలుసుకుని, తనను తాను బాహ్యంగా కనిపించే స్థూలదేహంతో కాక ఈ సూక్ష్మ శరీరంతో అనుసంధానించుకోవడం నేర్చుకోవాలి.

ఆత్మవికాసం చెందే తొలి నాళ్ళలో మన భౌతిక జీవితం నుంచి ఆధ్యాత్మిక జీవితాన్ని వేరుపరచి చూడటం చాలా కష్టం. ఆ స్థాయిలో మనం ఆధ్యాత్మిక చైతన్యాన్ని అభిలషించినప్పటికీ అది కూడా భౌతికంగా ఏదో



మహిమనో, మంత్రాన్నో ప్రదర్శించి చూపాలనే స్థాయిలో కేవలం శారీరక ఉపలబ్ధి కొరకే అన్నట్లుగా ఉంటుంది. కాని ఈ శరీరం వాటన్నింటికంటే ఉత్తమమైన కీలక ఆధారానికి ఆవాసం. ఈ జ్ఞానం లభించనంతవరకూ జీవితం యొక్క అర్థం, నిజమైన ఉపయోగం మన ఎరుకలోకి రాదు. ఈ చైతన్యాన్ని శరీరంతో పాటు పాతిపెట్టడానికి మనం ఎంతమాత్రమూ అనుమతించకూడదు. అది నాశనమే లేనటువంటి ఉన్నతస్థానమైన ఆ ఆత్మలోనే కేంద్రీకృతం కావాలి. ఈ విషయం మనకు పదే పదే బోధించబడుతున్నప్పటికీ మరణం ఆసన్నమయ్యేటప్పటికీ మనం దాని కాళ్ళముందు బోర్లాపడిపోతున్నాం. ఇటువంటి భయానికంతటికీ కారణం ఏది? అవగాహనాలోపం, అజ్ఞానం. శారీరికస్పృహ మనలోని ఆధ్యాత్మిక చైతన్యాన్ని ఎంతగా మరుగున పడవేస్తుందంటే మనం ఈ భౌతిక అస్తిత్వాన్ని తప్ప దీనికి అతీతమైన ఏ ఇతర ఉనికినీ ఊహించనైనా ఊహించం.

మనం ఈ శరీరం నుంచి వేరుపడేలోగా, ఈ అజ్ఞానపు తిమిరం నుంచి బయటపడటమే నిజమైన పునరుత్థానం. మన నిజస్వరూపాన్ని గురించిన ఒక్క దర్శనం చాలు, ఇంక మన దరికి ఏ మృత్యువూ చేరదు. క్రీస్తు దీన్ని ఆచరణలో చూపాడు. తన ఆత్మ అమరత్వం మీద ఎంత

దృఢ నమ్మకాన్ని కలిగి ఉన్నాడంటే మరణం ఎదురుపడినప్పుడు చెక్కుచెదరని ధైర్యంతో నిలబడ్డాడు. ప్రాణం ఉన్న ప్రతి జీవీ తప్పించుకోజూసే మరణాన్ని ఆయన చాలా అవలీలగా ఆహ్వానించారు. ఎందుకంటే నిజమైన మనిషికి మరణమంటే చిరిగిన వస్త్రాన్ని పారవేసి కొత్త వస్త్రాన్ని ధరించినట్లేనని ఆయనకు తెలుసు కనుక. బాహ్యపు తొడుగు పడిపోవచ్చు, కాని ఆత్మ ధరించిన అంతర్గత తొడుగును శిలువ వేసినా ఎవరూ నాశనం చేయలేరు. ఈ జ్ఞానాన్ని కలిగినవాడై అతడు మరణాన్ని తప్పించుకు పారిపోదామని ప్రయత్నించిందే లేదు. సోక్రటీస్ వంటి ఇతర మహాగురువుల జీవితాలలో కూడా మనం ఇదే విషయాన్ని గుర్తించవచ్చు. సూక్ష్మశరీరం భౌతిక మరణంతో నశించిపోదన్న విషయాన్ని గట్టిగా నమ్మినవాడై, అమరమైన తన స్వభావాన్ని ఎరిగినవాడై అతడు రక్తమాంసయుతమైన ఈ భౌతిక ముతకదేహాన్ని చాలా అవలీలగా విడిచిపెట్టేశాడు.

మనలోని ఈ సూక్ష్మశరీరాన్ని గురించిన స్పృహ కలుగనంతవరకూ మరణాన్ని అధిగమించి పోలేము. ఆ అంతిమ తీర్పు దినాన క్రీస్తు పునరుజ్జీవుడైనట్లు జనులందరు కూడా సమాధుల నుంచి సజీవులై తిరిగి వస్తారని భావించకండి. తమ ఆధ్యాత్మిక నిజస్వభావాన్ని గురించిన



స్పష్టమైన ఎరుకను, అనుభూతిని కలిగినవారు మాత్రమే ఆ విధంగా రాగలరు. భౌతికదేహానికి లోబడిపోయిన ఇతరులకు అది సాధ్యం కాదు. తమకు తామే సృష్టించుకున్న సంకెళ్ళకు బందీకృతులై బయటపడలేకపోతున్నారు. ఈ చక్రభ్రమణపు దశ పూర్తయిన తరువాతనే వారు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ పలు జన్మల పరిణామం ద్వారా తుదకు పూర్ణ వికాసాన్ని పొంది ఈ భౌతికదేహపు పరిమితుల నుంచి బయటపడతారు. మరణాంతరం కూడా ఈ భూమినే అంటిపెట్టుకున్న ప్రేతాత్మల గురించి మీరు వినే ఉంటారు. వారి అజ్ఞానం వలన తప్ప ఏ మానవాతీత శక్తీ వారిని ఆ విధంగా బంధించి ఉంచదు. భౌతికశరీరాన్నే సర్వస్వంగా భావించడం వలన మరణానంతరం కూడా ఆ దేహాన్నే అంటిపెట్టుకుని ఉండాలని ఆ పరిసరాల్లోనే ఈ ప్రేతాత్మలు పరిభ్రమిస్తుంటాయి. నశించిపోయే తత్త్వం కలిగిన ఈ దేహపు స్వభావాన్ని మార్చుడానికి వారు చేయగలిగిందేమీ లేదు. ఈ వాస్తవాన్ని గ్రహించి ఆత్మ తనను తాను ఈ పరిస్థితుల నుంచి వేరు పరచుకోనంత వరకూ అంతులేని ఆవేదన తప్పదు. భ్రాంతి ఎప్పటికీ భ్రాంతిగానే ఉండిపోతుంది. నిత్యం మార్పు చెందేది శాశ్వతమైన వస్తువు కానేరదు. మనిషి ఒక విషయాన్ని భ్రమపడి వేరొకటిగా ఊహించుకున్నంత మాత్రాన అది మారిపోదు. సత్యం మార్పు చెందనిది. అది ఎల్లప్పటికీ నిలిచే ఉంటుంది.

స్తబ్ధమైన సుదీర్ఘ శీతల ఋతువు అనంతరం ప్రకృతి పచ్చదనంతో ఏ విధంగా పరవళ్ళు త్రొక్కుతుందో, అదే విధంగా మనిషి కూడా నూతనోత్సాహంతో కొత్త జీవితాన్ని అభివ్యక్తీకరించుకోవడానికి ఉన్ముక్తుడవ్వాలి. దేహమే దేవాలయం. అది నాశనమే లేని అనంతమూ, అమరమూ అయిన ఆత్మారాముడు వసించే దేవాలయం. మనం ఆ ఆనందాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలి.

మన ఆత్మ ప్రకాశమంతా లౌకిక అవసరాలనే దిబ్బ క్రింద కప్పివేయబడి ఉంది. ఈ భౌతిక ఆవరణాన్ని చొచ్చుకుని మనలోని ఆధ్యాత్మిక క్షేత్రానికి చేరగలిగితే చాలు, తక్షణమే ఆ ప్రకాశం వికసితమై వెలుగొందుతుంది. నశ్వరమయ్యే ఈ భౌతికదేహానికే పరిమితమై దీనినే అంటిపెట్టుకోకుండా ప్రతీ వ్యక్తిలోను అంతర్నిహితమై శారీరక విఘటనాన్ని తట్టుకొని నిలబడే ఆ ఆత్మచైతన్యాన్ని తట్టిలేపాలి! ఆర్యమహర్షులు మరణాన్ని త్రోసిపుచ్చారు. ప్రజలందరికీ వారు ఈ విధంగా చాటి చెప్పారు: "ఓ అమృత పుత్రులారా! మీ దివ్యస్వభావాన్ని ఎందుకు మరచిపోయారు? అజ్ఞానంలో కూరుకుపోకండి. అమృతత్త్వపు త్రోవను అనుసరించి మీ నిజస్వభావాన్ని ఎరుకలోకి తెచ్చుకోండి, శాశ్వతత్త్వాన్ని ప్రాప్తించుకోండి."



అమరత్వాన్ని మనకెవరూ ప్రదానం చేయలేరు. మనకై మనమే సాధించుకోవాలి. ఆత్మను విస్మరించి నిత్యం ఈ శరీరభూతాన్నే పూజిస్తూ భౌతికసుఖాలనే ఆస్వాదిస్తూ ఉంటే మనకు మిగిలేదేమిటి? ప్రపంచంలోని సంపదనంతా మనం పాదాక్రాంతం చేసుకుని ఉండవచ్చు. కాని మనలోనే దాగి ఉన్న ఆ దైవత్వాన్ని సొంతం చేసుకోనంత వరకూ ఆ సంపదంతా ఎందుకూ కొరగానిదే అవుతుంది. ఆ అనంతాత్మకు వారసులమన్నది మన జన్మహక్కు. కాని మనకు ఆ విషయం గుర్తులోనే ఉండదు. ఎందుకు? ఎందుకంటే మన మనస్సు ఈ స్థూల భౌతికపదార్థ ప్రపంచంతో ఎంతగా తాదాత్మ్యం చెందిందంటే ఆత్మ చైతన్యం అన్నది మనకు సంబంధించినది కాక ఏదో పరాయి భావనగా తలచేంతగా. అయినప్పటికీ మనం నిరుత్సాహపడవలసిందేమీ లేదు. ఎందుకంటే ఆ అంతఃకరణ చైతన్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి మనం మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధితో ప్రయత్నం ప్రారంభిస్తే చాలు; మనం ఆధ్యాత్మిక బాటలో పయనిస్తున్నట్లే. ఆ ప్రయత్నంలో ఎన్నిసార్లు కిందకు జారినప్పటికీ మన హృదయాన్ని ఎరిగిన ఆ భగవంతుడు మన ఉత్సాహానికి, ప్రయత్నానికి తగ్గ ఫలితం ఇచ్చే తీరుతాడు. మన ప్రయత్నం నిజాయితీతో, ఆర్తితో కూడుకున్నదైతే ఆ అత్యున్నత

వికాసానికి అవసరమైన సమస్తాన్నీ ఆయనే సమకూర్చుతాడు.

మన లౌకిక జీవితానికి సమాంతరంగా ఆధ్యాత్మిక జీవితాన్ని అభ్యసించడం నేర్చుకోవాలి. ఆత్మాన్వేషణను విడిచిపెట్టకూడదు. ఎందుకంటే ఇహంలో కాని, పరంలో కాని మన ఆధ్యాత్మిక వికాసాన్ని బట్టే మన పరిస్థితులు నెలకొని ఉంటాయి. ప్రజలందరూ తమ చరమాంకంలో ఒకే ముగింపును చేరుకోలేరు. కొంతమంది ఈ జన్మలోనే ఆత్మసాక్షాత్కారం పొంది మృత్యువును అధిగమించవచ్చు. ఇంకొందరు ఈ దేహ స్మృతినుంచి విడివడకుండా ప్రేతాత్మలై తమ సమాధుల చుట్టూ తిరుగాడుతుండవచ్చు. శరీరం రాలిపోయేలోగా ఈ దేహాభిమానం నుంచి బయటపడటం చాలా ముఖ్యం. మరణానంతరం అంతులేని ఆనందం కాని, ఆధ్యాత్మికస్వేచ్ఛ కాని లభించే స్థితి ఉంటే, అప్పటివరకూ ఆగకుండా దానిని ఈ జన్మలోనే, ఈ క్షణంలోనే మనదిగా చేసుకొనే ప్రయత్నం చేయాలి.

ఈ జన్మానంతరం మనిషికి శాశ్వతజీవనం ఉంటుందనడంలో ఎంతమాత్రమూ నిజం లేదు. జీవితం ఇప్పుడు కూడా శాశ్వతమే. శ్మశానానికి చేరిన తరువాత కొత్తగా అమరత్వమేమీ రాదు. "మరి దానికోసం ప్రాకులాడవలసిన అవసరం ఏమిటి?" అని మీరనవచ్చు.



ఈ భూమిమీద జీవిస్తున్నప్పుడే మన మనస్సును అన్ని రకాల ప్రభావాల నుండి విముక్తం చేసి భగవత్సాక్షాత్కారానికి ఉపయోగపడే స్వచ్ఛమైన సాధనంగా చేసుకోకపోతే, అది మరణానంతరం మనకు ఒక ప్రతిబంధకంగా తయారవుతుంది. మన సూక్ష్మశరీరపు ఉనికిని ఈ జన్మలోనే అనుభూతం చేసుకోగలగాలి. గాలి, మట్టి, నీరు, నిప్పు, ఆకాశం వంటి పంచ భూతాల కలయిక అయిన ఈ దేహం నశించిపోయేదే. ప్రస్తుతం ఆత్మ శక్తిచేత ఇవన్నీ ఒక దగ్గరకు కూర్చబడి శరీరంగా ఉన్నాయి. ఆత్మ శరీరాన్ని వదిలినప్పుడు, ఈ మూలకాలన్నీ విడివడి విఘటనం చెందిపోతాయి. దీనికి అతీతమైన సూక్ష్మశరీరం నశించిపోదు. ఎందుకంటే అది పరమాత్మలోని విడదీయరాని భాగమైన ఆత్మప్రకాశానికి చేరువలో ఉంటుంది. మనిషి దైవత్వాన్ని బాహ్యంలో అన్వేషించవలసిన అవసరం లేదు. తనలోనే దాగి ఉన్న దివ్యత్వాన్ని గుర్తెరగనంతవరకూ మనిషి బాహ్యంలో నెలకొని ఉన్న దివ్యత్వాన్ని ఎప్పటికీ గ్రహించలేడు.

స్వకీయ హృదయాలను పవిత్రీకరించుకొని మనలోని దైవత్వాన్ని జాగృతం చేసుకోవడానికి అనేక మార్గాలున్నాయి. సేవ, స్వార్థరాహిత్యం, ధ్యానం, లక్ష్యంపైన తదేక దృష్టి వంటివన్నీ ఇందుకు దోహదపడతాయి. నిజానికి

ప్రతీ క్షణం ఈ దివ్యత్వాన్ని వ్యక్తీకరించడానికే మనందరం తెలిసో తెలియకో తాపత్రయపడుతుంటాం. కాని చిక్కేమిటంటే మనం తప్పుడు దిశగా ప్రయాణిస్తుంటాం. మనం ఎండమావులకై పరుగులు తీస్తుంటాం. ఈ అనిత్య జగత్తు అంతా ఎండమావులతో నిండి ఉంది. ఈ విషయం తెలుసుకోకుండా అసలైన దాన్ని వదిలిపెట్టి నీడలవెంట పరుగులు తీస్తుంటాం. చివరకు మిగిలేది బాధ మాత్రమే. ఎందుకంటే ఈ నీడలు, ఎండమావులు అందినట్లే అనిపించి తీరా దగ్గరకు చేరేసరికి మాయమైపోతుంటాయి. కనుక ఆ నిజమైన దాన్ని పొందడానికి ప్రయత్నిద్దాం. మహాత్ముల, అవతారపురుషుల అవతరణ లక్ష్యం ఇదే - నిజవస్తువుని మనకు అందించడం. అజ్ఞానంలో కూరుకుని పోయి మన నేత్రాలకు కనిపించనటువంటి ఆ పరరాజ్యంపై మనకు నమ్మకం కలిగించడానికి, ఆ రాజ్యాన్ని నిజంగా మనపరం చేయడానికి, తద్వారా ఈ దేహంలో ఉండగానే ఆ దివ్యత్వపు మహదానందాన్ని మనకు అనుభూతం చేయడానికే వారు అవతరిస్తుంటారు. బుద్ధుడు, శ్రీరామకృష్ణులు, ఇతర మహాత్ములందరి స్ఫూర్తి అమరత్వమనే మన జన్మహక్కును సాకారం చేసుకోవడానికి ప్రేరణగా పనిచేయాలని నా హృదయాంతరాళాల్లో నుంచి ప్రార్థిస్తున్నాను.

**SRI SHUKABRAHMA ASHRAMAM**
**https://www.youtube.com/channel/UCBScn**

**PxbLKRf7DDgQ36HDwQ**

**Chitanya Bhagavadgita**
**www.youtube.com/**

**@ChitanyaBhagavadgita**

**Telangana Gundechappudu**
**http://www.youtube.com/**

**@TelanganaGundechappudu-d9j**